# పీర్లచావిడి ప్రారంభించిన పల్లె రఘునాథ్ రెడ్డి

### - పలుకుటుంబాలకు పరామర్శ



పీర్లచావిడిని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

**కొత్తచెరువు, ఆగస్టు 05, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన కొత్తచెరువులోని ఇసుక వంక వీధిలో నూతనంగా నిర్మించిన పీర్ల చావిడిని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున పూలహారాలతో పల్లెకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన అక్కడ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, స్థానికులను పలుకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల ప్రమాదంలో గాయపడ్డ విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి కొంత మేర ఆర్థిక సహాయం అందించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న ఆంజనేయులు, దివ్యాంగురాలువరలక్ష్మి తండ్రి పెద్దన్నలకు ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల మృతిచెందిన సురేష్‌బాబు భార్య వేదవతిని, అనారోగ్యంతో ఉన్న శ్రీరాములు మరియు అక్కమ్మలను పల్లె పరామర్శించి ఆర్థిక సహాయాలు అందించారు. అలాగే వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకొని బిసి కాలనీని సందర్శించిన పల్లెకు మహిళలు పెద్ద ఎత్తున్న సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె వెంట తెదేపా కన్వీనర్లు రామకృష్ణ, ఒలిపి శ్రీనివాసులు, సాలక్కగారి శ్రీనివాసులు, బండ్లపల్లి రాజు, సుబ్బరాయుడు, చింతకాయల నరసింహులు, గాజుల చంద్ర, వడ్డె శ్రీరాములు తదితర తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రారంభించిన పీర్లచావిడిలో ప్రత్యేక ప్రార్థనలు

## వైభవంగా వరమహాలక్ష్మీ వేడుకలు



**అమరాపురం, ఆగస్టు 5 ( ప్రభాతవార్త :** మండల వ్యాప్తంగా శుక్రవారం వరమహాలక్ష్మీ వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అదే విధంగా ప్రధాన దేవాలయలల్లో వరమహాలక్ష్మీదేవత ఉత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారి ప్రతిమను ప్రతిష్టాపన చేసి రంగురంగు పూలతో అలంకరణ చేసి సాంప్రదాయ బద్ధంగా పూజా కార్య క్రమాలు నిర్వహించారు. ఇందులో మండల వ్యాప్తంగా హేంజేరు సిద్ధేశ్వరస్వామి, వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వరదేవాలయలతోపాటు వివిధ గ్రామాల్లో కూడా భక్తులు ప్రతి ఇంటి వరమహాలక్ష్మీదేవతను ప్రతిష్టాపించి పూజా కార్య క్రమాలు వైభవంగా నిర్వహించారు.

## ఆగని చినుకులు.. చిత్తడితో రోడ్డులు



చిత్తడైన రోడ్డు

**అమరాపురం, ఆగస్టు 5 ( ప్రభాతవార్త) :** మండల వ్యాప్తంగా గత వారంరోజులుగా వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తుండడం ద్వారా గ్రామాలకు వెళ్లే రోడ్లు చిత్తడిగా మారాయి. ప్రయాణికులకు వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కరంగా మారింది. ముఖ్యంగా ఆగ్రహారంలోని ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రోడ్డు, అమరాపురం నుంచి బుల్లికుంటకు వెళ్లే రోడ్డు హనుమంతనపల్లి నుంచి కరిదాసన హాట్టికి వెళ్లే రోడ్డు, హేమాతి నుంచి కర్నాటక బార్డు తంబాలహాట్టికి వెళ్లే రోడ్డుతోపాటు అమరాపురం నుంచి కర్నాట బార్డర్ నాగేపల్లి గేటుకు వెళ్లే ప్రధాన రోడ్డును డబుల్ రోడ్డు ఏర్పాటు నిమిత్తం రోడ్డు పనులు జరుగుతుండటం ద్వారా ప్రస్తుతం ప్రాయాణికులు, వాహచోదకులు వెళ్లే పరిస్థితి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# కామాంధుల పాలనలో మహిళలకు రక్షణ కరువు

- ఎన్టీఆర్ కుటుంబంపై నీచ ప్రచారం..మీరు మనుషులేనా?
- గోరంట్లమాధవ్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలి
- తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న సవిత

**పెనుకొండ ఆగస్టు05 ప్రభాతవార్త :** వైసీసీ కామాంధుల పాలన లో మహిళలకు రక్షణ కరువైందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గౌరవపదమైన పదవిలో ఉన్న యంపీ గోరంట్ల మాదవ్ ఒక మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన తీరు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. ఇతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలి ఆమె డిమాండ్ చేశారు. ఇలాంటి సిగ్గుమాలిన పని చేసిన వ్యక్తిని చట్టసభల నుంచి వెలి వేయాలన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కుమారై ఉమమహేశ్వరి దురదృష్టావశాత్తు అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకుంటే మానవత్వం లేకుండా ఎన్టీఆర్ కుటుంబ సభ్యులపై, నారా చంద్రబాబునాయుడు పై అసత్య ప్రచారంతో దూషించడం సరికాదన్నారు. వాస్తవాలు తెలుసుకుని వైకాపా నాయకులు మాట్లాడాలని హితవు పలికారు. జగన్మోహన్‌రెడ్డి కౌబినెల్లో ఉన్న ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్‌ల రాసలీలు బయటపడినప్పడే ముఖ్యమంత్రి వీరి మీద కఠినచర్యలు తీసుకోక పోవడం వల్ల వీరిని మరింత ప్రోత్సహించినట్లు తెలుస్తోందన్నారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు ప్రజాప్రధుల దగ్గరికి వస్తారని, ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే రాష్ట్రంలో వైసీపీ నేతల దగ్గరకు వెళ్లాలంటే రాష్ట్రంలో మహిళలు భయంతో వణికిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాలికానీ, వైసీసీ నేతలు రేపిస్టులా తయారౌతున్నారని విమర్శించారు.

## పట్టణ జనసేన అధ్యక్షులుగా లోకేష్

### పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా: పట్టణ అధ్యక్షులు



పట్టణ అధ్యక్షులు లోకేష్

**పెనుకొండ ఆగస్టు05 ప్రభాతవార్త :** పెనుకొండ పట్టణ కమిటీ అధ్యక్షులుగా ఎంపికైనట్లు లోకేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇన్‌చార్జులు లేకపోయినప్పటకి ఎంతో మంది యువతకు జనసేనపార్టీలో గుర్తింపునిచ్చి, యువతరం మేల్కొలుపు అని మహానుభావుడి మాటలు జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ నిజం చేస్తున్నారన్నారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు టీసీ వరుణ్, భవాని రవికుమార్, ఉపాధ్యక్షులు ఈశ్వర్ నాగేంద్రలకు ప్రత్యేక కృతజ్ఞతులు తెలిపారు. అదే విధంగా హిందూపురం ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్, జిల్లా కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని లోకేష్ తెలిపారు.

## ఘనంగా వరలక్ష్మి పండుగ



**అగళి, ఆగస్టు 5 ప్రభాతవార్త :** మండలంలో ఘనంగా వరమహాలక్ష్మి పండుగను చేసుకున్నారు. ముఖ్యంగా మహిళలు వేకువ జామునే లేచిస్నాన మాచరించి ప్రతి ఇంటిలోనూ వరలక్ష్మిప్రతిమను ఏర్పాటు చేయడంతోపాటు అరటి, మామిడి, తోరణాలతో అలంకరించడం తోపాటు రంగురంగుపూలతో వరమహాలక్ష్మిని అలంకరించి ముత్తైదువులను పిలిచి వారికి పండ్లు, తమలపాకులను ఇచ్చి పంపడం ఆనవాయితీ. మండల వ్యాప్తంగా వరమహాలక్ష్మి వ్రతాన్ని ఘనంగా జరుపుకున్నారు.

# మూడురోజులు కష్టపడ్డాం.. అయినా కట్టుకాలువలో నీరు మళ్లీ వృథా అవుతోంది

### - లబోదిబోమంటున్న రైతన్నలు



కట్టు కాలువలో నీరు వృథా అవుతున్న దృశ్యం

**అగళి, ఆగస్టు 5 ప్రభాతవార్త :** గత మూడు నాలుగు రోజులుగా పార్టీలకు అతీతంగా ప్రజలు, రైతులు గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు అంతా కలిసి కట్టుగా అగళిచెరువుకు నీరు చేరే కట్టు కాలువ తెగిపోవడంతో 3, 4రోజులపాటు అంతా మూకుమ్మడిగాకష్టపడి ఇసుక బస్తాలు గట్టిగాఉన్న సిమెంట్ బస్తాలు, అక్కడున్న ముళ్లకంపలు, ఇనుపకడ్డీలు వేసి 50 శాతంనీరు అగళి చెరువుకు చేరే విధంగా శ్రమపడ్డారు. కానీ వీళ్లశ్రమా అంతా వృధా అయ్యే విధంగారాత్రి, ఈ రోజు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటి ధాటికి మళ్లీకట్టుక ఆలువలోని నీరు తెగి వృథా అవుతోంది. తెగిన కాలువ నుంచి రైతుల పొలాలపైన నీళ్లు పోయే విధంగా ఏర్పాటు చేశారు కానీ అవే నీళ్లుప్రస్తుతం వెనక్కి మళ్లడంతో ఆకట్టిన కాలువ వద్దకు తోసుకుని ముందుకు పోవడంతో మళ్లీ కట్టు కాలువ నీరు వృథా అవుతోంది. గత నాలుగు రోజులుగారైతులు పడ్డశ్రమ వ్యర్థమవుతోంది. ఎవరో ఒక్కరు స్వార్థం కోసం పైపులను తీయడానికి ఆ గట్టును తెగొట్టడం అదే ఇప్పుడు నీరు వేస్ట్ అవడానికి కారణమవుతోంది. వచ్చే నీటి ధాటికి అడ్డుకట్ట వేయడం అంత సులువైన పనికాదు. అయినా రైతులు,ప్రజలు కలిసి కట్టుగా చేసి 50 శాతం నీటిని అగళి చెరువుకు వచ్చే విధంగాశ్రమ పడ్డారు. మళ్లీ నీరు వృథా అవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఏకంగా 30 ఏళ్లపాటు అగళి చెరువు నిండలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కర్ణాటక ఎగువ ప్రాంతంలో చెరువులు, డ్యాంలు మొత్తం నిండిపోయి ఆ మిగిలిన జలాలు దిగువకు వస్తుంటే వాటిని కూడా సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి. ఇప్పటికీ అగళి చెరువు నిండలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సువర్ణముఖి నదికి అడ్డంగా గూబులగట్ట వద్దరంగాపురం వద్దరెండు కొండలకు అడ్డంగాడ్యాంలను నిర్మించడం, అక్కడున్న దాదాపు 10, 12 చెరువులు, చెక్ డ్యాంలు అడ్డుకట్టలు నిండి ఈరోజు ఉదయం సువర్ణముఖి నది అగళి మండలంలోకి ప్రవేశించిందంటే ఇన్ని రోజులు ఏకదాటిగా వచ్చిన వర్షపు నీటిని కర్ణాటక వాసులు ఏ విధంగాసద్వినియోగం చేసుకుటున్నారో. అనుమతి లేని దగ్గర, చెరువులను తలపించే విధంగాడ్యాంలు, అడ్డుకట్టలు, చిన్న చెరువులను నిర్మించడం మూలంగానే ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు అగళి నీరు అగళి మండలంలోకి రావడంలేదు. గతరెండేళ్ల క్రితం శివనగెర వద్దనూతనంగా సువర్ణముఖి నదికి అడ్డంగా డ్యాంనునిర్మించడంతో నెలరోజుల నుంచి ఏకధాటిగా వర్షం వస్తున్నా దిగువ ప్రాంతానికి నీరు రాని విధంగా గట్టిచర్యలను కర్ణాటక వాసులు తీసుకోవడం కట్టలుకట్టడం మూలంగానే జరుగుతోంది. బ్రిటీష్ ప్రభుత్వంలో మైసూర్-మద్రాస్ రాష్ట్రం ఉమ్మడిగా ఎగువప్రాంతం నుంచి వచ్చే నీటిని ఒసహల్లి వద్ద సపోర్టు వాలు నిర్మించిసరి సమానంగా వాడుకునే విధంగా తీర్మాణం చేశారు కానీ ఆ తీర్మాణం తుంగలోకి తొక్కి విపరీతంగా అడ్డుకట్టలు, చెక్‌డ్యాంలు నిరిర్మంచడంతో నీరు రావడం లేదని మండలప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శివనగెర వద్ద సువర్ణముఖి నదికి అడ్డంగా నూతనంగా నిర్మించిన డ్యాం

# ఆధార్‌కు ఓటరు కార్డు అనుసంధాన ప్రక్రియకు సహకరించండి

### - ఆర్డిఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి తిప్పేస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డిఓ తిప్పేనాయక్



హాజరైన తహాశీల్దారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

**ధర్మవరం, ఆగస్టు 5 ప్రభాతవార్త :** ఆధార్ కార్డుకు ఓటరు కార్డును అనుసంధానం చేసే ప్రక్రియకు రాజకీయ పార్టీ నాయకులు, ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని ఆర్డిఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి తిప్పేనాయక్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆడియో ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశాన్ని నిర్వహజంచారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎఇన్నకల అధికారి కార్యాలయం నుంచి వచ్చిన తగు సూచనలను వారికి తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణకై నూతన మార్గ నిర్దేశాలు ఆగస్టు నెల నుంచి అమలు కానున్నాయని తెలిపారు. ఈ అనుసంధాన ప్రక్రియ 2023 ఏప్రిల్ 1వ తేది వరకు నిర్వహజంచబడుతుందన్నారు. ఇంటింటా బిఎల్‌ఓలు వచ్చినప్పుడు ఆధార్‌కార్డులు అందించాలని, ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే రాజకీయ నాయకులు, ప్రజలు సహకరించాలని తగు సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ధర్మవరం బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబబ , మండలాల తహాశీల్దారులతోపాటు ఈడిటి అనిల్‌కుమార్, ధర్మవరం ఇన్‌చార్జ్ తహాశీల్దారు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

**తహాశీల్దార్లతో సమావేశం..** ఆర్డిఓ కార్యాలయం ఛాంబర్‌లో శుక్రవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహాశీల్దారులతో ఆర్డిఓ తిప్పేనాయక్ సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమతమ మండలాలలో రాజకీయ పార్టీ నాయకులతో ఈప్రక్రయ గూర్చి సమావేశం నిర్వహించి, విజయవంతం అయ్యేలా సహకరించాలని వారు తెలిపారు.

## జీడిపల్లి రిజర్వాయరులో ప్రేమికుల శవాలు..?

**బెళుగుప్ప, ఆగస్టు 5 ప్రభాతవార్త :** మండల పరిధిలోని జీడిపల్లి రిజర్వాయరులో ఒక యువతి, ఒక యువకుడు శవాలు తేలియాడుతూన్న దృశ్యాలను స్థానికులు కనుగొన్నారు. వరదల కారణంగా ఎక్కడి నుండైనా కొట్టుకువచ్చారా..? లేక ప్రేమించుకున్న యువతీ,యువకులెవరైనా అత్మహత్యకు పాల్పడ్డారా..? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసుల దర్యాప్తులో అసలు నిజాలు వెల్లడి కావాల్సి ఉంది.

## మహిళలకు చీరలు పంపిణీ చేసిన నవీన్‌నిశ్చల్



చీరలు పంపిణీ చేస్తున్న నవీన్‌నిశ్చల్

**హిందూపురం, ఆగస్టు 5 ప్రభాత వార్త :** వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని ఏపి ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ శుక్రవారం సాయిప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 501 మంది మహిళలకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవీన్‌నిశ్చల్ మాట్లాడుతూ మహిళలకు వరలక్ష్మీవత్రం సందర్భంగా చిరుకానుక అందచేయడం పట్ల సంతోషంగా వుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## ఎంఎల్‌సిని కలిసిన ఆర్టీఒ



ఎంఎల్‌సికి పుష్పగుచ్ఛం అందచేస్తున్న కరుణసాగర్‌రెడ్డి

**హిందూపురం టౌన్, ఆగస్టు 5 ప్రభాతవార్త :** హిందూపురం ఆర్టీఒగా బాధ్యతలు చేపట్టిన కరుణసాగర్‌రెడ్డి శుక్రవారం ఎంఎల్‌సి ఇక్బాల్‌ను తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

## లేపాక్షిలో ఘనంగా శ్రీవరలక్ష్మీవ్రతం



**లేపాక్షి, ఆగస్టు 5 ప్రభాతవార్త :** మండల వ్యాప్తంగా శ్రీవరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో పలువురు మహిళలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన లేపాక్షిలో పలువురు గృహాల్లో ప్రత్యేక అలంకారం చేసి శ్రీవరలక్ష్మీదేవి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతి గృహంలో ముత్తైదువులకు పసుపుకుంకుమ గాజులు, రవికలు అందచేశారు. కుటుంబసభ్యులు ఆయురారోగ్యాలతో సుఖంగా వుండాలని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వేదపండితులు కుటుంబసభ్యులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందచేశారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి



విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన రైతు ముత్యాలప్ప

**ధర్మవరం, ఆగస్టు 5 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ముచ్చురామి గ్రామానికి చెందిన ముత్యాలప్ప (40) అనే రైతు శుక్రవారం ఉదయం దినచర్యలో భాగంగా పొలములోని మోటార్ వేసే సమయంలో, మోటారు పని చేయకపోవడంతో వెళ్లి చూసే సమయంలో చేతికి వైరు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన తండ్రి తమ్ముడు హుటాహుటిన విద్యుత్‌ను ఆపి పరిశీలించి, ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని ధృవీకరించారు. రూరల్ ఎస్సై ప్రదీప్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దరార్యప్తుచేపట్టారు. మృతునికి భార్య నాగమణితోపాటు ఇంటర్మీడియట్ చదువుతున్న కుమారుడు, 10వ తరగతిచదువుతున్న కుమార్తెలు కలరు. ఈ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని బంధువులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## గుర్రంపాటి దేవేందర్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి- టిడిపి పార్టీ శ్రేణులు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

**చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 5 ప్రభాతవార్త :** మొన్నటి రోజున మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆఖరి పుత్రిక ఉమామహేశ్వరి, మరణంపై సోషల్ మీడియా వేదికగా ఒక కట్టుకథ ద్వారా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, నారాలోకేష్‌పై అసత్య ప్రచారాలు చేసిన గుర్రంపాటిదేవేందర్‌రెడ్డిపై, అదే విధంగా వైసీపీ పేటిఎం బ్యాచ్‌కు బాస్ అయిన విజయసాయిరెడ్డిపై, అసత్య ప్రచారాలు చేసిన మరికొందరిపై కేసు నమోదు చేయాలని శుక్రవారంచెన్నేకొత్తపల్లి మండల పోలీస్‌స్టేషన్‌లో తెలుగు దేశం పార్టీ శ్రేణులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి అసత్య ప్రచారాలు కట్టుకథలు అల్లి క ఇంచపరిచే విధంగాప్రచారంచేసే వారిని కఠినంగా శిక్షించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్యాదిండి ముత్యాలరెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిత్యావసర వస్తువుల ధరల పెంపుకు నిరసన



నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నేతలు

**అనంతపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త బ్యూరో :** నిత్యావసర వస్తువుల ధరలు పెంపునకు నిరసనగా విజయవాడ ఆంధ్ర రత్న భవన్ వద్ద శుక్రవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ ఘోరావ్ కార్యక్రమంలోపాల్గొన్న కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా.సాకే శైలజానాథ్‌తోపాటు ఏఐసిసి కార్యదర్శి గిడుగు రుద్రరాజు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు జంగా గౌతమ్, విజయవాడ నగర కాంగ్రెస్ ఖమిటీ అధ్యక్షులు నరహరిశెట్టి, నరసింహారావు, మైనార్టీ చైర్మన్ దాదాగాంధీ తదితరులు పాల్గొన్నారు.

## బీటీపి ప్రాజెక్ట్ 4 గేట్‌లద్వారా నీటిని విడుదల చేసిన అధికారులు



బీటీపి ప్రాజెక్ట్ 4 గేట్‌లద్వారా నీటిని విడుదల చేసిన దృశ్యం

**బ్రహ్మసముద్రం అగస్ట్ 05 ప్రభాతవార్త,:** మండలంలోని భైరావాని తిప్ప ప్రాజెక్ట్‌కు కర్నాటకాలో కురుస్తున్న అధిక వర్షాలకు ప్రాజెక్ట్‌కు గారీగా వరదనీరు వస్తుండటంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్ట్ పూర్తిస్తాయి నీటిమట్ట 1655 అడుగులు కాగా శుక్రవారం ఉదయం కల్లా ప్రాజెక్టుకు 1654 అడుగుల నీరు చేరడంతో అధికారులు 6వ గేట్‌ద్వారా నీటిని విడుదల చేసిన అధికారులు ఇన్‌ఫ్లో భారీగా వస్తుండటంతో 5,7,8 గేట్లను 1,2 అడుగుల మేర గేట్లనుఎత్తి నీటిని దిగువ వేదావతినదిలోకి వదిలారు ముందు జాగ్రత్తగా వేదావతి పరివాహక ప్రాంతంలోని ప్రజలను నదీలోకి వెళ్ళకుండా టాంటాం వేయించి ప్రజలను అప్రమత్తం చేశారు.ప్రాజెక్ట్‌కు పూర్తి స్థాయిలో నీరురాక 15 సంవత్సరాల అయిందని ఎట్టకేళకు ప్రాజెక్ట్ గేట్‌ల ద్వారా నీటిని విడుదల చేయడంవల్ల నదీపరివాహక ప్రాంతాల రైతులు అయకట్టు రైతులు అనందం వ్యక్తం చేశారు.

# పుట్టపర్తినియోజకవర్గ టిఎన్‌టియుసి కమిటీ ఎంపిక



నూతన కమిటీని ప్రకటిస్తున్న మాజీ మంత్రి పల్లె దృశ్యం

**పుట్టపర్తిరూరల్, ఆగస్టు 05, ప్రభాతవార్త :** టిఎన్‌టియుసి పుట్టపర్తి నియోజకవర్గ నూతన కమిటీని శుక్రవారం ఎంపిక చేసినట్లు శ్రీసత్యసాయి జిల్లా టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి షామీర్ తెలియజేశారు. మాజీ మంత్రి, పుట్టపర్తి నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జ్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ కమిటీని ప్రకటించడం జరిగిందన్నారు. టిఎన్‌టియుసి పుట్టపర్తి నియోజకవర్గ అధ్యక్షులుగా కొండకమర్ల నిజాంవలి, ప్రధాన కార్యదర్శి గాజుల రామాంజినేయులు, పుట్టపర్తి పట్టణ ఉపాధ్యక్షులుగా శంకర, కార్యదర్శిగా గంగాద్రి, కార్యనిర్వాహక కార్యదర్శిగా వి.చెన్నకేశవులు, రూరల్ కార్యదర్శిగా వెంగళమ్మచెరువుకు చెందిన చెగిచెర్ల రమణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా నిడుమామిడికి చెందిన మల్లికార్జున, షోషల్ మీడియా కార్యదర్శిగా జెరిపిటి సిద్ధార్థ, కొత్తచెరువుకు చాకలి శ్రీనాథ్, తలారి లింగమయ్య, నల్లమాడకు జి.శ్రీరాములు, చిన్నగాని సూర్యనారాయణ, అమడగూరుకు తమ్మల శీన, అంజి, ఓడిసికి కొమ్మిడి హరి, దుంగావత్ ఆంజనేయులు నాయక్, బుక్కపట్నంకు రాజు, అంజిలను కార్యదర్శి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎంపిక చేసినట్లు తెలియజేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నూతన కమిటీ ఆదేశపత్రాన్ని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక విభాగం ఉపాధ్యక్షులు కరణం సుబ్రహ్మణేశ్వర, జిల్లా ఉపాధ్యక్షులు శేషు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గాజుల రామాంజినేయులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో వరలక్ష్మివ్రతం



**పుట్టపర్తి, ఆగస్టు 05, ప్రభాతవార్త :** కరుణించి కాపాడవమ్మ లక్ష్మిదేవి అంటూ వరలక్ష్మిదేవి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుకున్నారు. లక్ష్మివారం శుక్రవారం వరలక్ష్మివ్రతాలు, పూజలతో ఆలయాలు క్రిక్కిరిసి పోయాయి. పుట్టపర్తి సమీపాన ఎనుములపల్లి శ్రీ లక్ష్మినరసింహ స్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టపర్తిలోని సత్యమ్మ, వాసవిమాత, దుర్గామాత, ప్రశాంతి నిలయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రాజారాం శ్రీ లక్ష్మినరసింహ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్పం, పట్టువస్త్రాలు, దీపాలంకరణలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పుష్పాభిషేకం, కుంకుమార్చన, లక్ష్మివ్రతం పూజలు నిర్వహించారు. అశేష భక్తులు ముఖ్యంగా మహిళలు ఉదయమే అమ్మవారికి ఫలం, పుష్పం, కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కరుణించి కాపాడమ్మ అంటూ వేడుకొని నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భగా భక్తులు వరలక్ష్మివ్రతం మహిమ తెలుసుకొని తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు.

## తనిఖీల వాస్తవాలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం



మీడియాతో మాట్లాడుతున్న సిఐ ప్రభాకర్ గౌడ్

**పుట్టపర్తిటౌన్, ఆగస్టు 05, ప్రభాతవార్త :** పుట్టపర్తిలో రెండు రోజులుగా పుడా కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాలలో చేపట్టిన తనిఖీల్లో బయటపడ్డ వాస్తవాలను ఏసిబి ఉన్నతాధికారులకు నివేదిస్తామని సిఐ ప్రభాకర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం రెండు కార్యాలయాల్లో ఏకకాలంలో రెండు బృందాలుగా ఎసిబి అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా రెండు కార్యాలయాలలో అనధికారికంగా అనుమతులు ఇవ్వడంపై, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ, రెండు కార్యాలయాల సిబ్బంది అవినీతిపై ఫిర్యాదులు అందాయని, తనతో పాటు మరో 5 మంది సిఐలు, 5 మంది ఎస్ఐలు ఇతర సిబ్బంది మొత్తం 20 మంది పాల్గొనడం జరిగిందన్నారు. అనుమానం ఉన్న రికార్డులను సీజ్ చేశామని, తమ నివేదిక అందిన తరువాత ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు శివగంగిరెడ్డి, శంకర్ రెడ్డి, శాంతిలాల్, మోహన్ రావు పాల్గొన్నారు.

## నేడు సిపిఐ ప్రథమ జిల్లా మహాసభలు

**పుట్టపర్తిటౌన్, ఆగస్టు 05, ప్రభాతవార్త :** శ్రీసత్యసాయి జిల్లాలో ప్రథమ సిపిఐ మహాసభలను రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయనతో పాటు ఆ పార్టీ నాయకులు సాయి అరామం అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయనమాట్లాడుతూ, శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు ఈ సభలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 03:00 గంటలకు స్థానిక హనుమాన్ సర్కిల్‌లో బహిరంగ సభ ఉంటుందని, పార్టీరాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. మహాసభలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చిస్తామని, భవిష్యత్తులో చేపట్టే కార్యాచరణ రూపొందిస్తామన్నారు. పార్టీ అనుబంధ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, బయన్న తదితరులు పాల్గొన్నారు.

# అదుపుతప్పి టమోటా బొలెరో వాహనం బోల్తా

### రోడ్డుపై పడిన టమోటాలను తొలగించిన యస్,ఐ



రోడ్డుపై పడిన టమోటాలను పరిశీలిస్తున్న యస్,ఐ శ్రీనివాసులు

**ఆత్మకూరు ఆగస్టు 5 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పంపనూరు వద్ద గల హంద్రీ-నీవా కాలువ సమీపాన టమోటాలును తీసుకెస్తున్న బొలెరో వాహనం బోల్తా పడటంతో టమోటాలురోడ్డుపై చల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో హైవేపై ప్రయాణిస్తున్న వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడ్డటం గమనించిన స్థానిక యస్,ఐ శ్రీనివాసులు, పోలీను సాయంతో రోడ్డుపై పడిన టమోటాలను ప్రక్కకు తీసివేశారు.రోడ్డుపై వెళ్ళుతున్నవాహనదారులు పోలీసులకు అభినందనలు తెలియజేశారు.

